క్లుప్తంగా

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మేయర్ రామయ్య, ఎమ్మెల్యే చరిత

కల్లూరు: కల్లూరు అర్బన్ పరిధిలోని కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు నగర మేయర్ బీవై రామయ్య, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. గురువారం 19వ వార్డులోని గౌతమీనగర్‌లో రూ. 24 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మేయర్, ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగరంలోని అన్ని వార్డులను అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

దారంతా గుంతలమయం!



కొల్లంపల్లితండా రోడ్డు దుస్థితి

కల్లూరు: మండలంలోని ఉలిందకొండ నుంచి కొలంపల్లి తండా, యాపర్లపాడు గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలమయంగా మారాయి. ఆయా రోడ్లపై నిత్యం భారీ వాహనాలు అధిక లోడుతో తిరుగుతుండడం వల్ల రోడ్లపై గుంతలు ఏర్పడుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్లను బాగు చేయాలని కోరుతున్నారు.

భూసమస్యలకు సత్వర పరిష్కారం



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ సందీప్ కుమార్

ఓర్వకల్లు: రైతుల భూ సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని ఆర్డీఓ సందీప్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆన్‌లైన్, 1బి రికార్డులను పరిశీలించారు. భూముల రీసర్వే రికార్డులను పరిశీలించి పనుల పురోగతి గురించి తహసీల్దార్ విద్యాసాగర్‌ను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు స్థానిక ఉర్దూ యూనివర్సిటీకి అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మంత్రి బీసీ

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె వద్ద హైవేపై జరుగుతున్న మరమ్మతు పనులను ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి గురువారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత ఉండాలని సూచించారు.

శిథిలావస్థకు ఓవర్‌హెడ్ ట్యాంకు



కూలేందుకు సిద్ధంగా ఉన్న ట్యాంకు

గడివేముల: మండల కేంద్రం గడివేముల బొల్లవరం రస్తాలో కొన్నేళ్ల క్రితం నిర్మించిన మంచినీటి ట్యాంకు శిథిలావస్థకు చేరుకుని కూలేందుకు సిద్ధంగా ఉంది. కొన్ని ఏళ్లపాటు గడివేముల గ్రామానికి తాగునీరు అందించిన ట్యాంకు ప్రస్తుతం శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు కూలుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కొత్త మంచినీటి ట్యాంక్ మంజూరు చేయించాలని కోరుతున్నారు.

డిగ్రీ స్పెషల్ సప్లిమెంటరీకి 56 మంది గైర్హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ, బీఈడీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా గురువారం జరిగిన పరీక్షలకు 56 మంది గైర్హాజరయ్యారు. డిగ్రీ పరీక్షలు – 11, బీఈడీ పరీక్షలు – 8 కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. డిగ్రీ పరీక్షలకు 321 మందికిగాను 275 మంది హాజరు కాగా 46 మంది గైర్హాజరయ్యారని, వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. బీఈడీ పరీక్షలకు 76 మందికి 66 మంది హాజరు కాగా 10 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు.

ఉత్సవం.. అంబరాన్నంటిన సంబరం

- చౌడేశ్వరిదేవి తిరునాలను పురస్కరించుకుని పోటీలు
- ఉత్సాహంగా పాల్గొన్న గ్రామస్తులు
- విజేతలకు బహుమతుల ప్రదానం



హోరాహోరీగా తలపడుతున్న పొట్టేళ్లు



గోనెసంచితో పరుగెత్తుతున్న బాలురు



తిండి పోటీల్లో పోటీపడి అరటిపండ్లు తింటున్న యువకులు

కోడుమూరు రూరల్: కోడుమూరులో వెలసిన చౌడేశ్వరీదేవి తిరునాలను పురస్కరించుకుని కమిటీ సభ్యులు గురవారం ఏర్పాటు చేసిన క్రీడా పోటీలు కోలాహలంగా జరిగాయి. గోనెసంచితో పరుగెత్తడం, పొట్టేళ్ల పోటీ, వాలీబాల్ పోటీలు, తిండి పోటీలు, తప్పెట, ముద్దుపాపల పోటీలు ఉత్సాహంగా సాగాయి. క్రీడాకారులు పోటీపడి తమ ప్రతిభను ప్రదర్శించారు. గోనెసంచితో పరుగెత్తే పోటీల్లో కోడుమూరుకు చెందిన భాస్కర్ ప్రథమ స్థానంలో నిలువగా, మిన్నెల్ల ద్వితీయ స్థానం, సమీర్ బాషా తృతీయ స్థానంలో నిలిచారు. అలాగే జయపాల్, జయవర్దన్, శిరీష, లక్ష్మీచంద్ ప్రోత్సాహక బహుమతులను గెలుచుకున్నారు. అలాగే తిండి వీరుల పోటీల్లో వెంకటగిరి చెందిన గిడ్డయ్య ప్రథమస్థానం, కోడుమూరుకు చెందిన క్రిష్ణ, జమ్ములయ్య ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. తప్పెట పోటీల్లో కోడుమూరుకు చెందిన ఇమ్మానుయేలు, మధు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో, అనుగొండకు చెందిన మధు తృతీయ స్థానాలు సాధించారు. హోరాహోరీగా సాగిన పొట్టేళ్ల పోటీలో ఎర్రబాడుకు చెందిన బాలు పొట్టేలు విజేతగా నిలిచింది. ముడుమలగుర్తికి చెందిన భైరవ, వెంకటగిరి పొట్టేళ్లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలతో కిక్కిరిసింది. పోటీల నిర్వహణతో పట్టణంలో సందడి నెలకొంది.



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న సీఐ తబ్రేజ్

రోడ్డు భద్రతపై అవగాహన



మాట్లాడుతున్న ఎంవీఐ రవీంద్రకుమార్

కర్నూలు (టౌన్): వాహనాదారులు రహదారి భద్రతా నియమాలపై అవగాహన కలిగి ఉండాలని రవాణా శాఖ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) కె.రవీంద్రకుమార్ సూచించారు. నగర శివారులోని బి.తాండ్రపాడులోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో గురువారం 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ.. జనవరి 16 నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు నిర్వహించే రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా డ్రైవర్లు, వాహనదారులకు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంపూర్ణ అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇన్సూరెన్స్ కంపెనీల మేనేజర్లు మాట్లాడుతూ.. వాహనదారులు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. ప్రమాదం జరిగినప్పుడు వాహనంలోని వ్యక్తి చనిపోయినా, గాయపడినా పరిహారం లభిస్తుందన్నారు. రవాణా శాఖ ఇన్‌స్పెక్టర్లు సుధాకర్‌రెడ్డి, నాగరాజునాయక్ పాల్గొన్నారు.

చౌడేశ్వరీ దేవికి పట్టువస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలు అందజేస్తున్న కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, సతీష్

కోడుమూరు రూరల్: కోడుమూరులో వెలసిన చౌడేశ్వరీదేవి తిరునాలను పురస్కరించుకుని కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సతీష్ గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా లింగమయ్య ఇంటి నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో కోడుమూరు జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు క్రిష్టారెడ్డి, క్రిష్టాపురం సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, కోడుమూరు ఉపసర్పంచ్ మాదులు, మాజీ ఉపసర్పంచ్ ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రమేష్‌నాయుడు, నాయకులు రవికుమార్‌రెడ్డి, మల్లారెడ్డి, శివరాముడు, లింగన్న, రాఘవేంద్ర, లింగమూర్తి, హనుమంతు, విష్ణుదాస్, జగదీష్, మాసుమ్, బోరెల్లి సోమన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మూడో శనివారం గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు



పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

ఓర్వకల్లు: స్వచ్ఛాంధ్ర– స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి మూడో శనివారం గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పంచాయతీ కార్యదర్శులు చొరవ తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్రతి ప్రభుత్వ కార్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. కార్యాలయ ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించడం, లోపల ఉన్న మరుగు దొడ్లను శుభ్రం చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మరుగుదొడ్డికి నీటి సరఫరా ఉండేలా చూడాలన్నారు. అవసరమైతే మరమ్మతులను చేయించాలని చెప్పారు. అలాగే కార్యాలయాల వద్ద మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్యం కార్యక్రమంలో భాగంగా చెత్తకుప్పలను తొలగించాలని తెలిపారు. ప్రతి ఇల్లు, దుకాణం, పాఠశాల వద్ద చెత్తను తొలగించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ విషయాలపై శుక్రవారం పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించాలని సూచించారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్రపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు పాల్గొనేలా చూడాలని తెలిపారు.

కొలతల ప్రకారం పనులు చేస్తే అధిక కూలి



నందనపల్లెలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ వెంకట రమణయ్య

కర్నూలు(రూరల్): ఉపాధిహామీ పథకం కూలీలు నిర్ణయించిన కొలతల ప్రకారం పనులు చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకట రమణయ్య అన్నారు. గురువారం నందనపల్లె గ్రామ పరిధిలో జరుగుతున్న పనులను పీడీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కూలీల హాజరు, మస్టర్లను పరిశీలించారు. కొలతల ప్రకారం పనులు చేస్తే రోజువారి వేతనం రూ.300 వరకు వస్తుందని తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి 12 గంటల వరకు పనిచేయాల్సి ఉంటుందన్నారు. ప్రతి కూలీ కనీసం 6 గంటలు పనిచేయాలని కేంద్ర ప్రభుత్వం గైడ్‌లైన్స్ జారీ చేసిందని తెలిపారు. పనుల్లో నాణ్యత ప్రమాణలు పాటించాలని సూచించారు. ఒకరి బదులు మరొకరు పనులకు రాకూడదన్నారు. ఎవరి పేరు ఉంటే వారే పనుల్లో ఉండాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో పనులు అవసరమైన కూలీలు ముందుకొస్తే వెంటనే వారికి ఉపాధి పనులు కల్పిస్తామని తెలిపారు. కూలీల హాజరు శాతం మరింత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ రఘునాథ్, ఏపీఓ మధుబాబు, మనోహర్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ ఉన్నారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని బి.తాండ్రపాడు గ్రామం సర్వేనంబర్ 330, 344లో కొట్టాలు వేసుకున్న పేదలపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. దాడిలో గాయపడిన మహిళను గురువారం కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇల్లు లేని పేదు కొట్టాలు వేసుకుంటే దాడి చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. అర్హులందరికీ ఇంటి స్థలాలు మంజూరు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సీపీఎం నాయకులు ఉసేనయ్య, రాఘవేంద్ర, కృష్ణ పాల్గొన్నారు.

ముమ్మరంగా ఫార్మర్ రిజిస్ట్రీ



వివరాలు నమోదు చేయించుకుంటున్న రైతులు

సి.బెళగల్: మండలంలో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోందని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి వివరాలు నమోదు చేయించుకున్నారు. కాగా 15 రైతు సేవా కేంద్రాల్లో పది వేలకు పైగా రైతులు ఉండగా రెండు రోజుల్లో 1,424 మంది రైతులు వివరాలను నమోదు చేసుకున్నట్లు తెలిపారు. వారికి యూనిక్ కోడ్ జారీ చేసినట్లు చెప్పారు. ఆధార్ తరహాల్లో ప్రతి రైతుకు 14 అంకెల నంబర్ కేటాయిస్తామని.. ఈ నంబర్ ఆధారంగా ప్రభుత్వ పథకాలు, రాయితీల అమలు జరుగుతుందని తెలిపారు. రైతులు ఆయా రైతు సేవా కేంద్రాల్లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు.

దాడి కేసులో ముగ్గురిపై కేసు

గడివేముల: మండల పరిధిలోని ఒండుట్ల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గణేష్ రెడ్డిని దాడి చేసి గాయపరిచిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. పైబోగుల గ్రామానికి చెందిన తిరుపాలు, మమత, గోవర్ధన్ దాడి చేసి గాయపరిచినట్లు బాధితుడి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

యూరియా కోసం రైతుల ఆందోళన

పాణ్యం: మండల పరిధిలోని అలమూరు రైతు సేవా కేంద్రంలో యూరియా కోసం రైతులు ఎగబడ్డారు. గురువారం ఉదయం లారీలు గ్రామానికి చేరుకోవడంతో పెద్ద ఎత్తున రైతులు కేంద్రానికి వచ్చారు. అయితే రైతులకు సరిపడా యూరియా రాకపోవడంతో ఆందోళనకు దిగారు. అధికారుల తీరుపై మండిపడ్డారు.

15న కాల్వబుగ్గలో సమన్వయ సమావేశం

ఓర్వకల్లు: కాల్వబుగ్గ దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నిర్వహణపై శనివారం అధికారుల సమన్వయ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ మద్దిలేటి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు జరిగే సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే గౌరు చరితతో పాటు, టీటీడీ పాలక మండలి సభ్యుడు మల్లెల రాజశేఖర్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు సదుపాయాలు కల్పించేందుకు అన్ని శాఖల ఆధికారుల సలహాలు, సూచనలు తెలుసుకునేందుకు సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు తమ నివేదికలతో హాజరుకావాలని కోరారు.

ఎన్‌సీడీ సర్వే పూర్తి చేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో ఎన్‌సీడీ సర్వే త్వరగా పూర్తి చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ ఆదేశించారు. ఆమె గురువారం కర్నూలులోని రోజా యూపీహెచ్‌సీ పరిధిలో ఉన్న 123, 124వ సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న ఎన్‌సీడీ 3.0 సర్వేను తనిఖీ చేశారు. మాట్లాడుతూ.. ఈ సర్వేలో రొమ్ము, నోటి క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్‌తో పాటు బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ పరీక్షలు చేస్తారన్నారు. అనుమానిత కేసులను పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలకు పంపిస్తారని, మెరుగైన వైద్యం అవసరమైన వారిని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు రెఫర్ చేస్తారని తెలిపారు. డీఐఓ డాక్టర్ నాగప్రసాద్‌బాబు, డీపీఎంఓ డాక్టర్ ఉమ, డెమో శ్రీనివాసులు, వైద్యాధికారులు ఫాతిమా, నందిని, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఎపిడమాలజిస్టు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనతతో ఆరోగ్య సమస్యలు

కర్నూలు(హాస్పిటల్): రక్తహీనత వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పీడియాట్రిక్స్ కర్నూలు అధ్యక్షుడు డాక్టర్ విజయానందబాబు చెప్పారు. ఐఏపీ ఆధ్వర్యంలో గురువారం బి.క్యాంపులోని ట్రైబల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహించి, రక్తహీనత వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. కర్నూలు మెడికల్ కాలేజీ, మిడుతూరు సీహెచ్‌సీ, గుడిపాడు ప్రభుత్వ పాఠశాల, సరోజినిదేవి బాలికల పాఠశాలల్లో అవగాహన కల్పించారు.

వంతెన నిర్మించాలని హైవే దిగ్బంధం



హైవేపై నిరసన తెలుపుతున్న తండావాసులు

పాణ్యం: సుగాలిమెట్ట గ్రామం వద్ద హైవే దాటేందుకు వంతెన నిర్మించాలని సుగాలిమెట్ట ప్రజలు గురువారం హైవే దిగ్బంధించారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ప్రతిరోజూ అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, తక్షణమే హైవేపై రోడ్డు దాటేందుకు వంతెన నిర్మించాలని డిమాండ్ చేశారు. గ్రామంలో ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ పాఠశాలలు ఉన్నాయని.. వందలాది మంది విద్యార్థులు నిత్యం రోడ్డు దాటుతుంటారని, ప్రమాదాలు చోటు చేసుకుంటున్నట్లు తెలిపారు. హైవే అధికారులు చొరవ తీసుకొని రోడ్డు దాటేందుకు వంతెన నిర్మించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వారికి సర్దిచెప్పి పంపించారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

- కలెక్టర్ రంజిత్ బాషా



జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను సన్మానించిన కలెక్టర్, జేసీ

కల్లూరు: చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కలెక్టర్ రంజిత్ బాషా అన్నారు. చిన్నటేకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఐఐటీ మెడికల్ అకాడమీకి చెందిన విద్యార్థులు జేఈఈ మెయిన్స్ మొదటి విడత ఫలితాల్లో మంచి ప్రతిభ చాటారు. టాప్ పర్సంటైల్ సాధించిన విద్యార్థులను కర్నూలు కలెక్టర్ రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ నవ్య సన్మానించారు. హాజరైన 60 మంది విద్యార్థులు కూడా మంచి పర్సంటైల్ సాధించినట్లు అకాడమీ డైరెక్టర్ జిల్లా ఉన్నతాధికారులకు వివరించారు. కార్యక్రమంలో డీసీఓ డాక్టర్ శ్రీదేవి, అకాడమీ డైరెక్టర్ ఉమామహేశ్వరప్ప, రిటైర్డ్ పీడీ చంద్రశేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటును ఆపండి



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు

కోడుమూరు రూరల్: తమ పొలాల్లో గ్రీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ అనుమతి లేకుండా విద్యుత్ స్తంభాలను వేయిస్తోందని, వెంటనే ఆపి తమకు న్యాయం చేయాలని గురువారం గూడూరుకు చెందిన రైతులు బుజ్జన్న, కురువ శేఖర గోపాల్ తహసీల్దార్ రామాంజినేయులుకు విన్నవించారు. తమకు మాట మాత్రమైనా చెప్పకుండా తమ భూముల్లో దౌర్జన్యంగా కరెంట్ స్తంభాలు వేస్తున్నారని.. కొందరు అధికారులు కూడా వారికే వత్తాసు పలుకుతున్నారని తహసీల్దార్ ఎదుట బాధిత రైతులు వాపోయారు. తహసీల్దార్ మాట్లాడుతూ వీఆర్వో, సర్వేయర్‌తో భూములను సర్వే చేయించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

వరిలో సస్యరక్షణ అవసరం



వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ

సి.బెళగల్: రబీ సీజన్‌లో భాగంగా మండల రైతులు సాగు చేస్తున్న వరిలో సంరక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేషకుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రం సి.బెళగల్‌లో చెరువు కింద రైతులు సాగు చేసిన వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వరిలో సాధారణంగా వచ్చే తెగుళ్ల నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. పంటలో సుడిదోమ నివారణకు ఒక లీటరు నీటిలో 1.6 మిల్లీ లీటర్ల బ్యూఫ్రోప్రోజిన్ లేదా 1.5 గ్రాముల అసిపేట్ పిచికారీ చేసుకోవాలని తెలిపారు. అదే విధంగా అగ్గితెగుళ్ల నివారణకు ఒక లీటరు నీటికి 0.6 గ్రాముల ట్రైసైక్లోజల్‌ను కలిపి పంటపై పిచికారీ చేయాలని, కాండం కుళ్లు తెగుళ్ల నివారణకు లీటరు నీటికి 2 మిల్లీలీటర్ల హెక్సాకోనోజోల్ లేదా ఒక మిల్లీలీటర్ ప్రాపికోనోజోల్‌ను పిచికారీ చేసుకోవాలని సూచించారు. కాగా పంటలో తెగుళ్లను గుర్తించినప్పుడు మాత్రమే మందులను పిచికారీ చేయాలని అనవసరంగా పంటలపై మందులను వాడితే అనలుకే నష్టం వచ్చే అవకాశం ఉందన్నారు.

మధ్యవర్తులకు ఆహ్వానం

కర్నూలు: జిల్లా కేంద్రంలోని మీడియేషన్ కేంద్రంలో మధ్యవర్తులుగా వ్యవహరించేందుకు సుముఖంగా ఉన్నవారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాలు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్థి సూచనల మేరకు 40 గంటల శిక్షణా కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గురువారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన సామాజిక కార్యకర్తలు, నిపుణులు/నిష్ణాతులు, వారు పనిచేసిన రంగాలలో కనీసం 15 సంవత్సరాల అనుభవం లేదా ఉన్నత స్థానాల్లో పని చేసి పదవీ విరమణ చేసిన సీనియర్ ఎగ్జిక్యూటివ్స్ కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూరించిన దరఖాస్తులను ఈనెల 17వ తేదీలోగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, న్యాయ సేవా సదన్, కర్నూలు అనే చిరునామాకు పంపాలన్నారు.

ప్రకృతి వ్యవసాయ సాగు విధానం పరిశీలన



సాగు పద్ధతులను తెలుసుకుంటున్న సీఏఎస్ సంస్థ శాస్త్రవేత్తలు

కోడుమూరు రూరల్: గూడూరులో ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతు గొల్ల లక్ష్మీదేవి సాగు చేస్తున్న ఆకుకూరలు, కూరగాయల సాగును ఏపీ, తెలంగాణకు చెందిన సీఏఎస్ సంస్థ శాస్త్రవేత్తలు రాజశేఖర్, రాంప్రసాద్, ఉదయ్ సందర్శించారు. రైతు లక్ష్మీదేవి ఎకరా పొలంలో ఎలాంటి రసాయనిక ఎరువులు, మందులు వాడకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా ఆకుకూరలు, కూరగాయలు పండించడం ఎంతో గొప్పగా ఉందంటూ మహిళా రైతు కృషిని శాస్త్రవేత్తలు అభినందించారు. అనంతరం ఆకుకూరలు, కూరగాయల సాగుకు పాటిస్తున్న పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీసీ ఎస్ఎఫ్ డీపీఎం చంద్రశేఖర్, ఎల్‌టూ శేఖర్, ఏఈఓలు లక్ష్మీనారాయణ, శ్రీవాణి, రైతులు పాల్గొన్నారు.